1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers

సంపుటి : 2 సంచిక : 193 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 07 జూన్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 193 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 07 June 2025 PAGES : 8 PRICE : 3/-


# చినాబ్‌పై చికుబుకు..

## ప్రపంచంలోనే ఎత్తైన వంతెనను ప్రారంభించిన మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూన్ 06)

శతాబ్దపు కల నేటితో సాకారమైంది. ప్రపంచంలోనే ఎత్తయిన రైల్వే ఆర్చి బ్రిడ్జి అయిన చినాబ్ ఉక్కు వంతెన ను ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించారు. కట్‌ఢా నుంచి కశ్మీర్‌కు వందేభారత్ రైలుకు జెండా ఊపడం ద్వారా ఆ వంతెన అందుబాటులోకి వచ్చింది. అత్యంత దుర్లభమైన శివాలిక్, పీర్ పంజాల్ పర్వత శ్రేణులను కలుపుతూ కశ్మీర్ లోయకు రైలును నడపాలన్న బ్రిటీష్ కాలం నాటి ప్రణాళిక ఇప్పటికి కార్యరూపం దాల్చింది. అలాగే కట్‌ఢాలో రూ.46వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. కట్‌ఢా-శ్రీనగర్ మధ్య రైలుకు ఆయన జెండా ఊపారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా తీగలతో అనుసంధానించిన అంజీ రైల్వే వంతెన (కేబుల్ బ్రిడ్జి)ను కూడా ప్రారంభించారు.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత ప్రధాని జమ్మూకశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఉధంపుర్‌లోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దిగిన మోదీ.. వంతెన ప్రారంభానికి ముందు దానిని పరిశీలించారు. అలాగే జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా చినాబ్, అంజీ వంతెనలపై పరుగులు తీసిన వందేభారత్ రైలులో మోదీ ప్రయాణించారు. అనంతరం మోదీ కట్‌ఢాలో బహిరంగ ర్యాలీలో పాల్గొంటారు. ఉగ్రదాడి నేపథ్యంలో భారీ స్థాయిలో భద్రతా బలగాలను మోహరించారు. -మిగతా 2లో

## ఏపీ సీఎం చంద్రబాబుతో నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం భేటీ

ఎనిమిది జిల్లాలతో విశాఖ ఎకానమిక్ రీజియన్ ఏర్పాటుకు నిర్ణయం
2032 నాటికి 120 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా ప్రణాళిక
విశాఖను మరో ముంబై నగరంగా అభివృద్ధి చేయాలని సీఎం సంకల్పం
మూలపేట-కాకినాడ మధ్య బీచ్ రహదారి అభివృద్ధికి చర్యలు
వివిధ ప్రాజెక్టుల కోసం లక్ష ఎకరాల భూమి గుర్తించాలని అధికారులకు ఆదేశం



(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 06)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ముఖ్యంగా విశాఖపట్నం ప్రాంతాన్ని ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక అడుగులు వేస్తున్నారు. శుక్రవారం నాడు సచివాలయంలో నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలకమైన అంశాలపై కూలంకషంగా చర్చించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, మౌలిక సదుపాయాల కల్పన ప్రధాన అజెండాగా ఈ భేటీ సాగింది. ఈ సందర్భంగా, 8 జిల్లాలను కలుపుతూ విశాఖపట్నం కేంద్రంగా ఒక ప్రత్యేక ఆర్థిక రీజియన్‌ను (విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్) ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రాంతాన్ని ఆర్థికంగా బలోపేతం చేసి, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, 2032 సంవత్సరం నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 120 బిలియన్ డాలర్ల స్థాయికి చేర్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు ఆయన వెల్లడించారు. విశాఖపట్నం నగరాన్ని దేశ ఆర్థిక రాజధాని ముంబై తరహాలో అభివృద్ధి చేసేందుకు ఒక సమగ్ర ప్రణాళికను అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఇందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. -మిగతా 2లో

## త్వరలో నాకూ ప్రమోషన్ వస్తుందనుకుంటున్నా

ప్రధాని మోదీతో ఒమర్ అబ్దుల్లా
ప్రధాని మోదీ ఎదుట జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా అంశాన్ని లేవనెత్తిన ఒమర్ అబ్దుల్లా
గతంలో రాష్ట్ర సీఎంగా ఉండి, ఇప్పుడు కేంద్రపాలిత ప్రాంత సీఎంగా డిమోట్ అయ్యానన్న ఒమర్
రైల్వే సహాయ మంత్రిగా ఉన్న వ్యక్తి లెఫ్టినెంట్ గవర్నర్‌గా ప్రమోషన్ పొందారని ప్రస్తావన
త్వరలో తనకూ ప్రమోషన్ వస్తుందని ఆశిస్తున్నట్లు వ్యాఖ్య
చినాబ్ వంతెన ప్రారంభోత్సవ సభలో వ్యాఖ్యలు చేసిన ఒమర్ అబ్దుల్లా



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూన్ 06)

జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో రాష్ట్ర హోదా అంశాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే తనకు కూడా ప్రధాని మోదీ పదోన్నతి కల్పిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం జమ్మూకశ్మీర్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ సమక్షంలో, చినాబ్ వంతెన ప్రారంభోత్సవ సభలో ఒమర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధాని మోదీని ఉద్దేశించి ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ, "2014లో మీరు ఇక్కడికి వచ్చినప్పుడు నేను రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నాను. కానీ ఇప్పుడు, ఒక కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రిగా నేను డిమోట్ అయ్యాను. అప్పట్లో రైల్వేశాఖ సహాయమంత్రిగా ఉన్న వ్యక్తికి (ప్రస్తుత లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సినాను ఉద్దేశిస్తూ) లెఫ్టినెంట్ గవర్నర్‌గా పదోన్నతి లభించింది. త్వరలోనే నాకూ పదోన్నతి లభిస్తుందని ఆశిస్తున్నాను. దీన్ని సరిదిద్దడానికి ఎక్కువ సమయం పట్టదని నేను భావిస్తున్నాను" అని అన్నారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా మనోజ్ సినా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒమర్ అబ్దుల్లా 2009 నుంచి 2014 వరకు, జమ్మూకశ్మీర్ -మిగతా 2లో

## ఏఐలో నైపుణ్య శిక్షణ కోసం 'ఎన్ విడియా'తో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందం

ఏఐలో ఏపీని అగ్రగామిగా నిలిపేందుకు మంత్రి నారా లోకేశ్ కృషి

ఏఐ వర్సిటీ దిశగా కీలక అడుగులు

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 06)

దేశంలోనే ఏఐ ఆధారిత పరిశోధన, నవీన ఆవిష్కరణలు, నైపుణ్య అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగ్రామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) యూనివర్సిటీ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఏఐలో యువతకు నైపుణ్య శిక్షణ సహా ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించేలా ప్రపంచ ప్రఖ్యాత ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) కంప్యూటింగ్ సంస్థ "ఎన్ విడియా"తో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. -మిగతా 2లో



## సిమ్లా ఒప్పందంపై ఏ నిర్ణయం తీసుకోలేదు: పాక్



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూన్ 06)

భారత్‌తో 1972లో జరిగిన సిమ్లా ఒప్పందం నుంచి వైదొలగే అంశంపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని పాకిస్థాన్ విదేశాంగ శాఖ వివరణ ఇచ్చింది. ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ మాట్లాడుతూ సిమ్లా ఒప్పందానికి ఇక విలువలేదు.. అదొక డెడ్ డాక్యుమెంట్ అని వ్యాఖ్యానించారు. సింధూజలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేశారో లేదో తెలియదు గానీ.. సిమ్లా అగ్రిమెంట్ పనైపోయింది అని పేర్కొన్నారు. దీంతో తాము 1948 నాటి స్థితికి చేరుకొన్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న నియంత్రణ రేఖ కాస్తా కేవలం కాల్పుల విరమణ రేఖగా -మిగతా 2లో

## సాంకేతిక పరిజ్ఞానం న్యాయానికి చోదకశక్తి కారాదు

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 06)

న్యాయసేవల అందజేతలో సాంకేతిక పరిజ్ఞానానికే పట్టం కట్టడం ప్రమాదకరమని, ఇది న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్ హెచ్చరించారు. కోర్టులు మానవత్వాన్ని విస్మరించకూడదని చెప్పారు. లండన్‌లోని 'బ్రిటిష్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ కంపేరిటివ్ లా' గురువారం ఏర్పాటుచేసిన సదస్సులో 'కోర్టులు, వాణిజ్యం, చట్ట పాలన' అనే అంశంపై ఆయన కీలకోపన్యాసం ఇచ్చారు. డిజిటల్ యుగంలో వాణిజ్యానికి, చట్టపాలనకు మధ్య సమతుల్యత సాధించడంలో న్యాయవ్యవస్థ పాత్రను ఆయన నొక్కి చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం అందరికీ న్యాయం అందించే సాధనం కావాలని మాజీ సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యను జస్టిస్ గవాయ్ ఈ సందర్భంగా ఉటంకించారు. సాంకేతిక పరిజ్ఞానమనేది డ్రైవర్ సీటులో కూర్చున్న మరుక్షణం న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం నశించడం మొదలవుతుందని అన్నారు. చట్టపాలన పునాదుల నాశనానికి ఇది దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. సాంకేతికత వైపు అడుగులు వేసే తొందరలో మానవీయ కోణాన్ని విస్మరించకూడదని అన్నారు.



**భారత్‌లో బలమైన మధ్యవర్తిత్వ వ్యవస్థ**

అంతర్జాతీయ వాణిజ్య వివాద పరిష్కార మధ్యవర్తిత్వానికి కేంద్ర బిందువు కావాలని భారత్ అనునిత్యం కోరుకుందని జస్టిస్ గవాయ్ చెప్పారు. ఇందుకోసం ప్రగతిశీల చట్టాలను రూపొందించడంతోపాటు వాటి అమలుకు ఆధునిక న్యాయ వ్యవస్థను, బలమైన వ్యవస్థాగత మద్దతును ఏర్పాటు చేసుకుందని అన్నారు. "భారత్-బ్రిటన్ వాణిజ్య వివాదాల్లో మధ్యవర్తిత్వం" అనే అంశంపై ఆయన ప్రసంగించారు.

## ఎట్టకేలకు దిల్లీ సీఎంకు అధికారిక నివాసం కేటాయింపు



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూన్ 06)

దిల్లీ సీఎం రేఖా గుప్తా కు అధికారిక నివాసాన్ని గుర్తించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి దాదాపు 100 రోజుల తర్వాత ఆమెకు కొత్త బంగ్లాను కేటాయించారు. ఇది ఆమె నియోజకవర్గానికి దగ్గరగా ఉన్న సివిల్ లైన్స్‌లోని రాజ్ నివాస్ మార్గంలో ఓ బంగ్లా. ఈ క్రమంలోనే డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్‌కు, సాంఘిక సంక్షేమ మంత్రి రవీంద్ర ఇంద్రరాజ్‌లకు కూడా ఇక్కడే బంగ్లాలు కేటాయించారు. గతంలో ఆప్ నేత మనీశ్ సిసోదియా ఉన్న మధుర రోడ్డులోని ఇంటిని పర్యావరణ మంత్రి మంజీందర్ సింగ్ ఇకపై ఉపయోగించనున్నారు. భాజపా ప్రభుత్వంలోని కొత్త ఎంపీలందరికీ ఇప్పటికే కొత్త నివాసాలను కేటాయించారు. సీఎం ప్రస్తుతం షాలిమార్ బాగ్‌లోని తన నివాసం నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో అక్కడికి వచ్చే సందర్శకులు, వీఐపీలు, సీనియర్ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక సచివాలయానికి వెళ్లేందుకు రోజూ 25 కిలోమీటర్లు ఆమె ప్రయాణించాల్సి వస్తోంది. ఆమె నియోజకవర్గానికి దగ్గరగా ఉన్న సివిల్ లైన్స్ లేదా లుటియెన్స్ ప్రాంతాలకు అధికారులు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. కాగా.. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా పనిచేసిన సమయంలో సివిల్ లైన్స్‌లో 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్ బంగ్లాను అధికారిక నివాసంగా ఉపయోగించేవారు. ఆ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ) 'గా భాజపా అభివర్ణించింది. దీంతో ఆ బంగ్లాలోకి వెళ్లేందుకు భాజపా సీఎం విముఖత వ్యక్తంచేశారు.

## ఉగ్రవాదుల ఆవాసాలపై ఎన్‌ఐఏ దాడులు

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూన్ 06)

జమ్మూకశ్మీర్‌లోని 32 ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) గురువారం సోదాలు నిర్వహించింది. ఉగ్రమూకల ఆవాసాలు, వారికి అంతర్గతంగా మద్దతునిస్తున్న వారి నివాస ప్రాంగణాలపై దాడులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సోదాల్లో ఆయుధాలు, నేరాలకు సంబంధించిన పత్రాలు, డిజిటల్ పరికరాలను పెద్దమొత్తంలో స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఐఏ వెల్లడించింది. పుల్వామా, కుల్గాం, శోపియాన్, బారాముల్లా, కుప్వాడా జిల్లాల్లో పాకిస్థాన్ మద్దతుతో పనిచేస్తున్న ది రెసిస్టెంట్ ఫ్రంట్, యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ జమ్మూకశ్మీర్, ముజాహిద్దీన్ గజ్‌వాత్- ఉల్-హింద్, జమ్మూకశ్మీర్ ఫ్రీడమ్ ఫైటర్స్, కశ్మీర్ టైగర్స్ తదితర ఉగ్రసంస్థల కార్యకర్తలు, మద్దతుదారుల నివాసాలపై ఎన్‌ఐఏ దాడులు జరిపింది. ఇవన్నీ లష్కరే తయ్యిబా, జైషే మహ్మద్, అల్ బదర్ వంటి నిషేధిత ఉగ్రసంస్థలకు అనుబంధ సంస్థలుగా కొనసాగుతూ వాటి కుట్రలను అమలుపరుస్తున్నాయని ఎన్‌ఐఏ ఆరోపించింది.



## సింధూ జలాల కోసం పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి.. భారత్‌కు వరుస లేఖలు!

సింధూ జలాల ఒప్పందంపై పాకిస్థాన్ తీవ్ర ఆందోళన
నిర్ణయాన్ని మార్చుకోవాలని భారత్‌కు నాలుగు లేఖలు
మేలో ఒకటి, 'ఆపరేషన్ సిందూర్' తర్వాత మూడు లేఖలు
పాక్‌లో తీవ్ర కరవు భయాలు.. చర్చలకు రావాలని వినతి

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూన్ 06)

సింధూ నదీ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంతో పాకిస్థాన్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరుతూ పాకిస్థాన్ ఇప్పటివరకు నాలుగు సార్లు భారత్‌కు లేఖలు రాసింది. మే నెల ఆరంభంలో ఒక లేఖ పంపగా, 'ఆపరేషన్ సిందూర్' అనంతరం మరో మూడు లేఖలు పంపినట్లు -మిగతా 2లో



మొదటి పేజీ తరువాయి

# చినాబ్‌పై చికుబుకు..

**చినాబ్ వంతెన ప్రత్యేకతలివీ..** రైలు మార్గం ద్వారా కశ్మీర్‌ను భారత్‌లోని మిగతా ప్రాంతాలతో అనుసంధానించేందుకు చేపట్టిన ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే ప్రాజెక్టులో ఈ వంతెన భాగం. చినాబ్ నదీ గర్భం నుంచి 359 మీటర్ల ఎత్తులో దీన్ని నిర్మించారు. దీని పొడవు 1,315 మీటర్లు. ఇప్పటివరకు చైనాలోని బెయిపాన్ నదిపై ఉన్న షుబాయ్ రైల్వే వంతెన (275 మీటర్లు ఎత్తు) పేరుతో ఉన్న ప్రపంచ రికార్డును ఇది అధిగమించింది. పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువ కావడం విశేషం. అతివేగం, భూకంపాలు, వరదలు, బాంబు పేలుళ్లను సైతం తట్టుకునేలా అత్యాధునిక సాంకేతికతతో దీనిని నిర్మించారు. దీని ప్రారంభంతో జమ్మూ నుంచి శ్రీనగర్‌కు ప్రయాణ సమయం కూడా తగ్గుతుంది. ఈ వంతెన జీవితకాలం దాదాపు 120 ఏళ్లు అని ఇంజినీర్లు చెప్తున్నారు. దీనిపై గరిష్ఠంగా 100కి.మీ. వేగంతో రైలు వెళ్లే అవకాశం ఉంది. 1.31 కి.మీ. మేర విస్తరించిన దీని నిర్మాణానికి కేంద్రం సుమారు రూ.1,486 కోట్లు ఖర్చు చేసింది. అలాగే 28వేల టన్నుల ఉక్కును వినియోగించినట్లు తెలుస్తోంది. 2002లో అటల్ బిహారీ వాజ్‌పేయీ హయాంలో ఈ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారు. అంటే ఇప్పుడు 23 ఏళ్ల తర్వాత ఇది పూర్తయింది.

## ఏపీ సీఎం చంద్రబాబుతో నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం భేటీ

రాష్ట్రంలో పారిశ్రామిక, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, వివిధ ప్రాజెక్టుల నిమిత్తం రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఎకరాల భూమిని గుర్తించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీనితో పాటు, మూలపేట నుంచి కాకినాడ వరకు సముద్ర తీరం వెంబడి రహదారిని (బీచ్ కారిడార్) అభివృద్ధి చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ రహదారి నిర్మాణం ద్వారా పర్యాటకాభివృద్ధికి, రవాణా సౌకర్యాల మెరుగుదలకు దోహదపడుతుందని సీఎం వివరించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి మార్గనిర్దేశం చేస్తాయని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.

## త్వరలో నాకూ ప్రమోషన్ వస్తుందనుకుంటున్నా

పూర్తిస్థాయి రాష్ట్రంగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే, 2019లో కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసి, జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన విషయం తెలిసిందే. జమ్ముకశ్మీర్‌లో గత ఏడాది జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ)-కాంగ్రెస్ కూటమి విజయం సాధించడంతో, కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్ముకశ్మీర్‌కు ఒమర్ అబ్దుల్లా తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఆయన రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం డిమాండ్ చేస్తూనే ఉన్నారు.

## ఏఐలో నైపుణ్య శిక్షణ కోసం 'ఎన్ విడియా'తో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందం

ఈ మేరకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఉన్నత విద్య అధికారులు, ఎన్ విడియా(%శ్రీజ।ఈ।జు%) ప్రతినిధులు అవగాహన ఒప్పందం చేసుకున్నారు.

ఈ ఒప్పందం ద్వారా 10వేల మంది విద్యార్థులకు ఏఐలో నైపుణ్య శిక్షణ అందించనున్నారు. దీంతో పాటు 500 ఏఐ ఆధారిత స్టార్టప్ ల అభివృద్ధికి మద్దతు ఇవ్వనున్నారు. గతేడాది అక్టోబర్ లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. ఎన్ విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ తో ముంబైలో సమావేశం అయ్యారు. అమరావతిలో ఏర్పాటుచేయబోయే ఏఐ యూనివర్సిటీకి సహకరించాల్సిందిగా కోరారు. ఇందుకు హువాంగ్ సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో ఎన్ విడియాతో ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది.

ఆంధ్రప్రదేశ్ ను ఏఐ పరిశోధనల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రముఖ ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాలతో రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు ఆధునిక ఏఐ నైపుణ్యాలను అందించనున్నారు. రాబోయే సంవత్సరాల్లో 10 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, 500 ఏఐ ఆధారిత స్టార్టప్‌ల అభివృద్ధికి మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏఐ యూనివర్శిటీకి అత్యాధునిక కంప్యూటింగ్ వనరులు, సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్ లు, హార్డ్‌వేర్ సామర్థ్యాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.

పరిశ్రమలు, ప్రభుత్వం, విద్యా రంగం మధ్య బలమైన భాగస్వామ్యానికి ఈ ఒప్పందం వేదికగా మారనుంది. విద్యార్థులకు ప్రాజెక్ట్‌లు, పరిశోధన, మార్కెట్ అవకాశాలు, మెంటార్‌షిప్ వంటి అనేక అవకాశాలను కల్పించనున్నారు. ముఖ్యంగా ఏఐ, స్టార్టప్‌ల అభివృద్ధికి ఇది బలమైన వేదికగా నిలవనుంది. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అడ్వాన్స్‌డ్ ఏఐ రీసెర్చ్ హబ్‌గా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ ఒప్పందం కీలకమైన ముందడుగు కానుంది.

ఈ కార్యక్రమంలో 'ఎన్ విడియా(%శ్రీజ।ఈ।జు%)' సౌత్ ఏసియా ఎండీ విశాల్ దూపర్, స్ట్రాటజిక్ బిజినెస్ డైరెక్టర్ గణేశ్ మహబాల, ఏపీపీ ప్రైమస్ పార్ట్ నర్ సుమన్ కసానా, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, ఏపీఎస్ హెచ్ఈ ఛైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సింధూ జలాల కోసం పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి.. భారత్‌కు వరుస లేఖలు!

జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ లేఖలు పాకిస్థాన్ జలవనరుల శాఖ నుంచి భారత జలశక్తి మంత్రిత్వ శాఖకు అందినట్లు సమాచారం.సింధూ నదీ జలాలను నిలిపివేస్తే తమ దేశంలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు తలెత్తుతాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని పాకిస్థాన్ తన లేఖల్లో ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై చర్చలు జరిపేందుకు పాకిస్థాన్ సిద్ధంగా ఉందని ఆ లేఖల సారాంశంగా తెలుస్తోంది.భారత జలశక్తి మంత్రిత్వ శాఖ ఈ లేఖలను ప్రోటోకాల్ ప్రకారం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపినట్లు సమాచారం. అయితే, "రక్తం, నీరు రెండూ కలిసి ప్రవహించలేవు" అని ప్రధాని నరేంద్ర మోదీ పలు సందర్భాల్లో స్పష్టం చేసిన విషయం తెలిసిందే. పాకిస్థాన్‌తో చర్చలు జరిగితే కేవలం ఉగ్రవాదం, పీఓకే అంశాలపైనే ఉంటాయని భారత్ తేల్చిచెప్పింది.

**ఒప్పందం నేపథ్యం ఏమిటి?**

సింధూ నది, దాని ఉపనదుల జలాల పంపిణీ కోసం 1960లో ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్ మధ్య ఈ ఒప్పందం కుదిరింది. అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, సింధూ నదికి తూర్పున ప్రవహించే రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారత్‌కు పూర్తి హక్కులు లభించాయి. అదే సమయంలో, సింధూ నదితో పాటు పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్ నదులపై పాకిస్థాన్‌కు హక్కులు దక్కాయి.

## సిమ్లా ఒప్పందంపై ఏ నిర్ణయం తీసుకోలేదు: పాక్

భావిస్తామన్నది ఆయన ఉద్దేశం. 1948 భారత్-పాక్ యుద్ధం తర్వాత దీనిని ఏర్పాటు చేశారు.

ఈ నేపథ్యంలో విదేశాంగశాఖ ప్రతినిధి వివరణ ఇస్తూ "భారత్‌తో ఏ ద్వైపాక్షిక ఒప్పందాన్ని రద్దు చేసుకోవడానికి అధికారికంగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్రస్తుతం ఆ దేశంతో ఉన్న సిమ్లా ఒప్పందంతో సహా అన్ని ద్వేపాక్షిక ఒప్పందాలు అమల్లో ఉంటాయి" అని ఆ దేశానికి చెందిన ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్‌కు వెల్లడించారు. 1971లో భారత్-పాక్ యుద్ధం తర్వాత ఈ ఒప్పందం చేసుకొన్నారు. దీని ప్రకారం భారత్-పాక్ సంబంధాల నిర్వహణకు సంబంధించిన చర్యలు తీసుకొంటారు.

ఈ ఒప్పందం ద్వారా శాంతియుత ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని రెండు దేశాలు తీర్మానించాయి. ఇందులో కశ్మీర్ అంశమూ ఉంది. ఈ ఒప్పందంపై అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ, పాక్ అధ్యక్షుడు జుల్ఫికర్ అలీ భుట్టో సంతకాలు చేశారు. దీని ప్రకారం ఇరుదేశాలు మూడో దేశం జోక్యం లేకుండా ద్వైపాక్షిక చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలి. జమ్మూ కశ్మీర్‌లో కాల్పుల విరమణ లైన్‌గా నియంత్రణ రేఖను పునర్నిర్వచించడం. దానిని మార్చకూడదన్న నిర్ణయానికి రెండు దేశాలు కట్టుబడటం. బంగ్లాదేశ్ సార్వభౌమత్వాన్ని గుర్తించడంతోపాటు ఆ దేశంతో సంబంధాలను సాధారణ స్థితికి తేవడానికి పాకిస్థాన్ కట్టుబడటం వంటి అంశాలున్నాయి.

ఏప్రిల్‌లో పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత నుంచి భారత్-పాక్ సంబంధాలు పూర్తిగా క్షీణించాయి. భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఆ తర్వాత మే 7వ తేదీన పాకిస్థాన్, పీవోకేలోని 9 ఉగ్ర స్థావరాలపై దాడులు చేసింది. ఆ తర్వాత మే 8,9,10 తేదీల్లో పాక్ సైన్యం భారత మిలిటరీ బేస్‌లపై దాడికి యత్నించగా.. మన దళాలు తిప్పికొట్టాయి. ఆ తర్వాత పాక్ అభ్యర్థన మేరకు భారత్ ఆపరేషన్ సిందూర్‌కు తాత్కాలిక విరామం ప్రకటించిన విషయం తెలిసిందే.

## రూ.50 వేల కోట్లకు రక్షణ ఎగుమతులు..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 06)

ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సత్తా ప్రపంచానికి తెలిసిందని డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్, ఏరోస్పేస్, రక్షణరంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు జి.సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. స్వదేశీ పరిజ్ఞానం, శక్తితో రూపొందించిన డ్రోన్లు, రాడార్లు, క్షిపణి వ్యవస్థల ద్వారా రక్షణరంగంలో భారత్ ప్రపంచంలో అజేయశక్తిగా ఆవిర్భవిస్తోందన్నారు. గత ఏడాది రూ.24 వేల కోట్లుగా ఉన్న మన రక్షణ ఎగుమతులు, అతిత్వరలోనే రూ.50 వేల కోట్లను చేరుకుంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వరంగల్‌లోని ఎస్ఆర్ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన మూడో స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్వాంటం టెక్నాలజీ, ఏఐలలో భారత్ అగ్రగామిగా నిలుస్తోందని.. ఇది రక్షణరంగంలో మంచి పరిణామమన్నారు. అనంతరం ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణికి వర్సిటీ తరఫున డాక్టరేట్ ప్రదానం చేశారు. వర్సిటీ కులపతి ఎ.వరదారెడ్డి, వీసీ దీపక్‌గార్గ్, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సంగీత దర్శకుడిగా నాకు జన్మనిచ్చింది రామోజీరావే: కీరవాణి**

ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్‌పై 1990లో 'మనసు మమత' సినిమా ద్వారా తనకు సంగీత దర్శకుడిగా జన్మనిచ్చింది రామోజీరావేనని ఎం.ఎం.కీరవాణి అన్నారు. ఎస్ఆర్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఆయన 'ఈనాడు'తో మాట్లాడుతూ.. "రామోజీరావులాంటి వ్యక్తి మళ్లీ జన్మించరు. నా జీవితకాలంలో పదిహేను సార్లు ఆయన్ను కలిశాను. కలిసిన ప్రతిసారీ ఆయన్నుంచి కొత్త విషయాన్ని నేర్చుకునేవాడిని" అని తెలిపారు.

## మోదీకి కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఫోన్ కాల్... జీ7 సదస్సుకు ఆహ్వానం

భారత్-కెనడా సంబంధాల్లో సానుకూల పరిణామం

కెనడా ప్రధాని మార్క్ కార్నీ నుంచి మోదీకి ఫోన్ కాల్

పరస్పర గౌరవంతో కలిసి పనిచేస్తామని ఇరు నేతల ప్రకటన

ఈ నెలలో కనానాస్కిస్‌లో జీ7 సదస్సు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 06)

భారత్, కెనడా దేశాల మధ్య గత కొంతకాలంగా నెలకొన్న ప్రతిష్టంభన తొలగిపోయి, ద్వైపాక్షిక సంబంధాల్లో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైనట్లు తెలుస్తోంది. కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో హయాంలో తీవ్రంగా దెబ్బతిన్న ఇరు దేశాల సంబంధాలు, ఆయన తర్వాత ప్రధాని పీఠమెక్కిన మార్క్ కార్నీ చొరవతో తిరిగి గాడిన పడుతున్నాయని స్పష్టమవుతోంది. ఈ నెలలో కెనడాలో జరగనున్న జీ7 శిఖరాగ్ర సదస్సుకు హాజరుకావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీని మార్క్ కార్నీ స్వయంగా ఆహ్వానించడమే ఇందుకు నిదర్శనం. ఈ ఆహ్వానాన్ని స్వీకరించిన ప్రధాని మోదీ, కార్నీతో భేటీ కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ శుక్రవారం తనకు ఫోన్ చేశారని, ఈ సందర్భంగా ఆయనకు ఎన్నికల విజయం పట్ల అభినందనలు తెలిపి, జీ7 సదస్సు ఆహ్వానానికి ధన్యవాదాలు తెలియజేశానని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

"కెనడా ప్రధాని మార్క్ కార్నీ నుంచి ఫోన్ కాల్ రావడం సంతోషంగా ఉంది. ఆయన ఇటీవలి ఎన్నికల విజయానికి అభినందనలు తెలిపాను. కనానాస్కిస్‌లో జరిగే జీ7 సదస్సుకు ఆహ్వానించినందుకు ధన్యవాదాలు. శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశాలుగా, లోతైన ప్రజా సంబంధాలు కలిగిన భారత్, కెనడా పరస్పర గౌరవం, ఉమ్మడి ప్రయోజనాల ప్రాతిపదికన నూతనోత్సాహంతో కలిసి పనిచేస్తాయి. సదస్సులో మన భేటీ కోసం ఎదురుచూస్తున్నాను" అని ప్రధాని మోదీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి 17 వరకు జీ7 సమావేశాలు జరగనున్నాయి.

## బ్యూరోక్రసీ నిర్వీర్యం వెనుక అసలు కారణాలివే: జేపీ విశ్లేషణ

గతంలో గుమాస్తాగా చేరిన వ్యక్తి కలెక్టర్‌గా పదోన్నతి పొందిన సందర్భాలున్నాయన్న జేపీ

ప్రస్తుతం ప్రతిభతో సంబంధం లేకుండా టైమ్ బౌండ్ ప్రమోషన్లు ఇస్తున్నారని విమర్శ

అధికారులకు డొమైన్ నైపుణ్యం అవసరం లేకపోవడం వ్యవస్థకు చేటు అని వ్యాఖ్య

కీలక పదవుల్లో బయటి నిపుణులకు అవకాశం ఇవ్వకపోవడం సరికాదన్న జేపీ

పనితీరు ఆధారంగా ప్రోత్సాహకాలు, లేటరల్ ఎంట్రీ వంటివి అవసరమని సూచన

ప్రజలకు సేవ చేయడమే బ్యూరోక్రసీ లక్ష్యం కావాలని ఉద్ఘాటన

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 06)



ప్రభుత్వ యంత్రాంగంలో ఒకప్పుడు సాధారణ గుమాస్తాగా చేరిన వ్యక్తి కూడా తన ప్రతిభ, పనితీరుతో అత్యున్నత స్థాయికి, చివరకు కలెక్టర్‌గా కూడా పదోన్నతి పొందే అవకాశం ఉండేదని, కానీ నేటి పరిస్థితుల్లో అది ఊహించడం కూడా కష్టమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత బ్యూరోక్రసీలో నెలకొన్న లోపాలు, వాటిని సరిదిద్దాల్సిన ఆవశ్యకతపై ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

గతంలో ప్రభుత్వ వ్యవస్థలో ప్రతిభావంతులకు సముచిత స్థానం లభించేదని డా. జయప్రకాశ్ నారాయణ్ గుర్తుచేశారు. తాను ఐఏఎస్‌లో చేరిన సమయంలో (1980 ప్రాంతంలో) ఒక గుమాస్తాగా ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశించిన వ్యక్తి, కేవలం తన సమర్థత ఆధారంగా కలెక్టర్‌గా పదవీ విరమణ చేశారని ఆయన ఉదహరించారు. "ఒక క్లర్క్ కలెక్టర్ కావడం అనేది ఆనాటి వ్యవస్థ ప్రతిభకు ఇచ్చిన విలువకు నిదర్శనం. కానీ, నేటి భారతదేశంలో ఒక క్లర్క్ ఐఏఎస్ అధికారిగా కలెక్టర్ అవ్వడం అసాధ్యం" అని ఆయన అన్నారు. కాలక్రమేణా 'సోషలిస్ట్ జపం' పేరుతో గుర్రానికి, గాడిదకు తేడా లేకుండా అందరికీ టైమ్ బౌండ్ ప్రమోషన్లు ఇచ్చే దుస్థితికి వ్యవస్థ దిగజారిందని ఆయన విమర్శించారు. పని చేసినా, చేయకపోయినా, లంచం తీసుకున్నా, తీసుకోకపోయినా ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు ఖాయమనే పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**బ్యూరోక్రసీ నిర్వీర్యానికి కారణాలు:** ఐఏఎస్ వంటి సర్వీసులకు ఎంపికయ్యేవారు లక్షల మందిలో పోటీపడి అత్యంత ప్రతిభావంతులుగా వస్తున్నప్పటికీ, పది పదిహేనేళ్లలో వారు కూడా నిర్వీర్యం కావడానికి ప్రధానంగా మూడు కారణాలున్నాయని డా. జయప్రకాశ్ నారాయణ్ విశ్లేషించారు. డొమైన్ నైపుణ్యం అవసరం లేకపోవడం: ఈ రోజు విద్య, రేపు రక్షణ, ఎల్లుండి ఆర్థికం, ఆ తర్వాత టెక్నాలజీ.. ఇలా ఏ శాఖలోనైనా పనిచేయవచ్చనే వింత పోకడ మన ఉపఖండంలో తప్ప ప్రపంచంలో మరెక్కడా లేదని ఆయన అన్నారు. ఏ ఒక్క మనిషి అన్ని రంగాల్లో నిష్ణాతుడు కాలేడని స్పష్టం చేశారు. కీలక పదవులపై గుత్తాధిపత్యం: అన్ని కీలక పదవులను బ్యూరోక్రాట్లకే కేటాయించడం, బయట ఎంతటి నిపుణులున్నా వారి సేవలను వినియోగించుకోకపోవడం రెండో ప్రధాన లోపమని ఆయన పేర్కొన్నారు. పనితీరుతో సంబంధంలేని ప్రమోషన్లు: పని చేసినా, చేయకపోయినా ఆటోమేటిక్‌గా ప్రమోషన్లు రావడం, ప్రతి ఒక్కరూ చీఫ్ సెక్రటరీ స్థాయికి చేరుకోవడం వంటివి జరుగుతున్నాయని, దీనివల్ల పదవుల సంఖ్య పెరిగిపోతోందని అన్నారు. "ఒకప్పుడు రాష్ట్రమంతటికీ ఒక ఐజీ ఉంటే, ఇప్పుడు పెద్ద సంఖ్యలో ఐజీలు ఉంటున్నారు. అందరూ చీఫ్ సెక్రటరీలు కాలేరు కాబట్టి, పదుల సంఖ్యలో స్పెషల్ చీఫ్ సెక్రటరీలు, స్పెషల్ డీజీపీలు ఉంటున్నారు" అని ఆయన వివరించారు. ఇదే తరహా పనితీరు ఒక ప్రైవేటు కంపెనీలో ఉంటే అది మూడేళ్లలో మూతపడి ఉండేదని డా. జయప్రకాశ్ నారాయణ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ప్రజల సొమ్ముతో జీతాలిస్తోంది కాబట్టి, పని జరిగినా జరగకపోయినా పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌లో ఒక స్థాయి తర్వాత ప్రతిభ చూపకపోతే ఇంటికి పంపిస్తారని, కానీ ప్రభుత్వంలో అలా జరగడం లేదని, అందరినీ కొనసాగిస్తున్నారని తెలిపారు.వ్యవస్థలో మార్పు రావాలంటే ప్రతిభావంతులను గుర్తించి, వారికి ఉన్నత అవకాశాలు కల్పించాలని, మిగిలిన వారిని అవసరమైతే ఇంటికి పంపించాలని డా. జయప్రకాశ్ నారాయణ్ సూచించారు. బయట ఉన్న నిపుణుల సేవలను ఉపయోగించుకోవడానికి, కొంత పోటీతత్వం తీసుకురావడానికి ఉద్దేశించిన 'లేటరల్ ఎంట్రీ' వంటి ప్రతిపాదనలకు కూడా తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "మన బ్యూరోక్రసీ అద్భుతంగా పనిచేస్తుంటే, ప్రజలకు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా సేవలు అందుతుంటే ఇలాంటి ప్రయోగాలు ఎందుకని అడగవచ్చు. కానీ, ఆ పరిస్థితి ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.



## మెగా డీఎస్సీని పకడ్బందీగా నిర్వహించాలి

**అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 6)

జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, (తరువాయి 4లో...)

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక
ప్రకాశం

## ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌కు

# రాష్ట్ర సమాచార కమిషన్ షో కాజ్ నోటీసులు జారీ

**వాకీ టాకీల పేరుతో రూ.27 లక్షల ప్రజాధనం లూటీ**

**సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగు చూసిన అధికారుల అవినీతి**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 6)

ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్ షో కాజ్ నోటీసులు జారీ చేసింది. 2019 ఆర్థిక సంవత్సరంలో మున్సిపల్ సిబ్బంది విధుల సౌలభ్యం కొరకు 20 వాకీ టాకీలు కొనుగోలు చేసిన వ్యవహారం సమాచార హక్కు చట్టం దరఖాస్తుతో మలుపు తిరిగింది. బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన జర్నలిస్ట్, ఆర్టిఐ కార్యకర్త నాయుడు నాగార్జున రెడ్డి ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ప్రజా సమాచార అధికారికి గత సంవత్సరం ఆగస్టు 19వ తేదీన చేసుకున్న దరఖాస్తు వ్యవహారంలో కార్పొరేషన్ అధికారులు ద్వంద్వ ప్రమాణాలతో పరస్పర విరుద్ధమైన తప్పుడు సమాచారం ఇవ్వడంతో నాగార్జున రెడ్డి రాష్ట్ర సమాచార కమిషన్‌అ కు ప్పీలు చేశారు. ఆపిల్ పై విచారణ జరిపిన రాష్ట్ర సమాచార కమిషనర్ సిహెచ్ సునీల్ అప్పిలదారుడు నాగార్జున రెడ్డి వాదనలు పరిగణనలోనికి తీసుకుని మున్సిపల్ కార్పొరేషన్ రికార్డులు తనిఖీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జూన్ 2, 4 తేదీలలో ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత రికార్డులు తనిఖీలు నిర్వహించిన సందర్భముగా వాకి టాకీలు కొనుగోలు చేసిన వ్యవహారానికి సంబంధించిన ఫైల్స్, మెజర్మెంట్ బుక్స్ పరిశీలించడం జరిగింది.

**అసలు జరిగిందేమిటంటే...**

వాస్తవానికి టెండర్ వేయాల్సిన 27 లక్షల రూపాయల వాకి టాకీల కొనుగోలు వ్యవహారంలో, అధికారులు వారి అనుభవాన్ని రంగరించి ఉత్తర్వుల మేరకు నామినేటెడ్ టెండర్ ద్వారా కొనుగోలు చేసినట్లు తప్పుడు రికార్డులు సృష్టించారు. 27 లక్షల రూపాయల గ్రాంటును ఆరు పద్దులుగా విభజించి ప్రజాధనం లూటీ చేశారు. టెండర్ విధానం అనుసరించకుండా మహారాష్ట్రలోని పూణే కి చెందిన శీతల్ వైర్లెస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పేరుతో ఆరు దఫాలు 27 లక్షల అరవై వేలు చెల్లించినట్లుగా రికార్డులు సృష్టించారు.

## ఏపిడబ్ల్యుజేఎఫ్ నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులకు హెల్మెట్లు పంపిణీ





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 6)

ఏపీడబ్ల్యూజేఎఫ్ నూతన కార్యవర్గం ఈ నెల 23న ఒంగోలులో అట్టహాసంగా ఎన్నుకోవడం జరిగింది. అందులో భాగంగా యూనియన్‌కు సంబంధించి పొదిలి మండల మీడియా ప్రతినిధులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. శుక్రవారం ఉదయం పొదిలి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ టి వెంకటేశ్వర్లు, ఎస్ఐ వి వేమనల చేతుల మీదుగా మీడియా ప్రతినిధులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గంలో పొదిలి నుంచి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన షణ్ముఖ వెలుగు దినపత్రిక ఎడిటర్ ఓబులశెట్టి రాధాకృష్ణ ను సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వేమనలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్, ముల్లా హసన్ వలి (బడే), అహ్మద్, రామకోటిరెడ్డి, రాజశేఖర్, శ్రీను, బాజీ, తదితరులు పాల్గొన్నారు.

## నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలందించాలి

**జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా**





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 6)

జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న ఎంఎన్‌సియు, ఎస్ఎన్‌సియు ల ద్వారా అవసరమైన మౌలిక సదుపాయాలతో నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా వైద్యాదికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒంగోలులోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జిజిహెచ్)ని మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్, స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్‌లలో చేపడుతున్న మరమ్మతు పనులను పరిశీలించి వైద్యాదికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్, స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్‌లలో అన్ని మౌలిక సదుపాయాలతో నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పలు విభాగాలను పరిశీలించి, రోగులతో మాట్లాడి అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస నాయక్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జిజిహెచ్) సుపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

## విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయి

**ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్**

**బదిలీ పై వెళ్తున్న ఏఆర్ ఎస్పీ ఎంఎస్ఎస్ అశోక్ బాబుకు ఘనమైన ఆత్మీయ వీడ్కోలు పలికిన ప్రకాశం జిల్లా పోలీసులు**

**విధి పట్ల నిబద్ధత ఉన్నవారిని సమాజం ఎప్పుడూ గుర్తుంచుకుంటుంది**




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 6)

ప్రకాశం జిల్లా పోలీస్ శాఖ ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలో విశిష్ట సేవలు అందించిన అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎంఎస్ఎస్ అశోక్ బాబు, ఎఆర్ నాన్ క్యాడర్ ఎస్పీగా పదోన్నతి పొంది సాధారణ బదిలీలులో భాగంగా మంగళగిరి పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఆర్గనైజేషన్‌కి బదిలీ అవుతున్న ఏ ఆర్ ఎస్పీ ఎంఎస్ఎస్ అశోక్ బాబుకి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్, పోలీసు అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఏ ఆర్ ఎస్పీకి జిల్లా ఎస్పీ శాలువా కప్పి సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీగా నేను బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఏఆర్ ఎస్పీ పరిపాలన అంశాలపై అన్ని విధాలుగా నాకు సహాయ, సహకారాలు అందించారన్నారు. జిల్లాలో 3 సంవత్సరాల 7 మాసాలు విధులు నిర్వహించారని, ఎఆర్ఎస్సై స్థాయి నుంచి ఎస్పీ హోదా వరకు ఎదగడం అనేది గొప్ప విజయమని జిల్లా ఎస్పీ ప్రశంసించారు. జిల్లా పోలీస్ శాఖలో సిబ్బందికి యోగా, కరాటే, ధ్యానం, పలు క్రీడలు మరియు ఇతర కార్యక్రమాలు నిర్వహించడంలో ముందు ఉన్నారన్నారు. ఎలక్షన్ సమయంలో, బందోబస్తు, నేర నియంత్రణలో అందించిన సేవలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో ఎంతో అంకిత భావంతో పని చేశారని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చాలా సమయస్ఫూర్తితో వ్యవహరించారని కొనియాడారు. నూతనంగా బాధ్యతలు చేపట్టబోయే ప్రదేశంలో (తరువాయి 4లో...)

## పరిశ్రమల స్థాపనకు అనుమతులు సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా**





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 6)

పరిశ్రమల స్థాపనకు అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను నిర్దిష్ట గడువు వరకూ వేచి ఉండకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె అధ్యక్షతన ప్రకాశం భవనములో ప్రత్యేక జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలకు చెందిన వివిధ రాయితీలకు 449 క్లెయిములకు గాను 7 కోట్ల 22 లక్షల రూపాయలను మంజూరు చేశారన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతుల కోసం దరఖాస్తు చేసిన వివిధ శాఖలకు చెందిన 137 అనుమతులలో 110 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశారు. మిగిలిన వాటిని కూడా నిర్దిష్ట గడువులోగా పరిశీలించి అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమ సంస్థ జనరల్ మేనేజర్ బి శ్రీనివాసరావు, ఏపీ సిపిడిసిఎల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, నాబార్డు ఏజీఎం రవికుమార్, ఏపీఐఐసీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలందించాలి





## ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌కు

# రాష్ట్ర సమాచార కమిషన్ షో కాజ్ నోటీసులు జారీ

**షోకాజ్ నోటీసులు జారీ...** శుక్రవారం ఉదయం మంగళగిరి లోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో జరిగిన రెండవ అప్పీలు విచారణ సందర్భంగా, అప్పీల్ నాగార్జున రెడ్డి వాదనలను పరిగణనలోనికి తీసుకున్న రాష్ట్ర సమాచార కమిషనర్ సిహెచ్ సునీల్ వాకీ టాకీలు కొనుగోలు వ్యవహారంలో సంబంధం ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ అధికారులందరికీ షోకాజు నోటీసులు జారీ చేయవలసిందిగా ఆదేశిస్తూ, తదుపరి విచారణకు రూ.27 లక్షల వాకీటాకీలు రికవరీ, ఈ వ్యవహారంలో కార్పొరేషన్ చేపట్టిన యావత్తు చర్యలు తాలూకు నివేదికతో హాజరుకావాలని ఉత్తర్వులు జారీ చేశారు.

**చీరాల మున్సిపాలిటీలో కూడా ఇదే తీరు...** పారిశుద్ధ్య కార్మికుల సౌలభ్యం కోసం వాకీటాకీలు కొనుగోలు పేరుతో 2019 సంవత్సరంలో రూ.20 లక్షల ప్రజాధనం లూటీ చేశారు. చిత్తూరులో అడ్రస్ కూడా లేని ఒక ప్రైవేటు సంస్థ నుండి వాకి టాకీలు కొనుగోలు చేసినట్లు, అప్పటి ఉమ్మడి ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆదేశాల మేరకు సదరు వాకీ టాకీలను కలెక్టర్ కార్యాలయానికి అందజేసినట్లు తప్పుడు రికార్డులు సృష్టించి ప్రజల సొమ్మును మున్సిపల్ అధికారులు, మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, స్థానిక ప్రజాప్రతినిధి, కొంతమంది కౌన్సిలర్లు రూ.20 లక్షలను తమ జేబులు నింపుకున్నారు.

# మెగా డీఎస్సీని పకడ్బందీగా నిర్వహించాలి

అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచి డిఎస్‌సి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒంగోలులో మెగా డిఎస్సీ పరీక్ష జరుగుతున్న బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. కేంద్రంలో పరీక్ష జరగుతున్న తీరుతెన్నులను ఆమె పరిశీలించారు. అభ్యర్థులకు అక్కడ కల్పించిన వసతులను, పరీక్ష నిర్వహణను, బందోబస్తును పరిశీలించారు. అభ్యర్ధులకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా అన్ని వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో మెగా డిఎస్సీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా అన్నీ ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని 8 కేంద్రాల్లో మెగా డిఎస్సీ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా పరీక్ష జరుగుతుందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక డిపార్ట్ మెంటల్ అధికారిని నియమించడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ వెంట అర్బన్ తహసీల్దార్ మధుసూదన్‌రావు, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.








# విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయి

మెరుగైన సేవలు అందిస్తూ పోలీసు శాఖ ప్రతిష్ట పెంచాలని, వృత్తి జీవితంలో మరిన్ని పదోన్నతులు, పేరు ప్రఖ్యాతలు పొందాలని, ఆకాంక్షించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా మన్నారు. ఏఆర్ ఎస్పీ మాట్లాడుతూ ఈ పోలీస్ కుటుంబం నాకు మరిచిపోలేని అనుభవాలు అందించిందని, పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ చూపిన మద్దతు, ప్రేమ ఎప్పటికీ గుర్తుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ డిఎస్పీ రమణ కుమార్, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, మహిళా పియస్ ఇన్స్పెక్టర్ సుధాకర్, ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, ఒంగోలు టు టౌన్ సీఐ శ్రీనివాసరావు,ఒంగోలు తాలూకా సిఐ విజయకృష్ణ, సిసియస్ ఇన్స్పెక్టర్ జగదీష్, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఎఆర్ఎస్సైలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదర, సోదర మణులకు బక్రీద్ శుభాకాంక్షలు

## మాజీ ఎమ్మెల్యే, కందుకూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జ్ బుర్రా మధు సూదన్ యాదవ్



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 6)**
కందుకూరు నియోజకవర్గం ముస్లిం సోదర సోదరీమణులకు మాజీ ఎమ్మెల్యే, కందుకూరు నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జ్ బుర్రా మధు సూదన్ యాదవ్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం దురాచారాలను, బడుగు, బలహీన వర్గాల అణచివేతను వ్యతిరేకించి ధర్మ సంస్థాపన కోసం, పేదల ఉద్ధరణకు యుగ పురుషుడు అజ్రత్ ఇబ్రహీం జీవితాంతం చేసిన త్యాగాలకు ప్రతీకగా ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. పేదలకు దానధర్మాలు చేయాలనే గొప్ప ధ్యేయంతో ఏర్పాటు అయిన బక్రీద్ పండుగ అన్నారు. పేదలకు దాన ధర్మాలతో - భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని కోరుతూ కందుకూరు నియోజకవర్గం ముస్లిం సోదరీ,సోదరమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రతిభా అవార్డు గ్రహీతను సత్కరించిన సిఐ వెంకటేశ్వర్లు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 6)
రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా అందించే ప్రతిభా అవార్డుకు ఎంపికైన పొదిలి పట్టణానికి చెందిన ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న షేక్ రబ్బాని ముస్కాన్‌ను పొదిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ టి వెంకటేశ్వర్లు తన కార్యాలయంలో శుక్రవారం స్వీట్ తినిపించి అభినందనలు తెలిపారు. అదే విధంగా ప్రస్తుతం ఎస్‌విఐటి కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంజనీరింగ్ ఫౌండేషన్ కోర్సు నేర్చుకుంటున్న విద్యార్థినిని స్థానిక సిఐ టి వెంకటేశ్వర్లు సతీమణి సౌజన్య, ఎస్‌విఐటి డైరెక్టర్ జక్కం రేణుకరెడ్డిలు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రతి సంవత్సరం ఇచ్చే ప్రతిభ అవార్డులలో ఈ ఏడాది షేక్ రబ్బానీ ముస్కాన్‌కి లభించింది. ఇంటర్ ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు గాను 988 మార్కులు సాధించినందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యిందని మండల విద్యాశాఖధికారి యం శ్రీనివాస్ తెలియజేసారు.





# త్యాగానికి, సత్యానికి ప్రతీక బక్రీద్ పర్వదినాన్ని సుఖ శాంతులతో జరుపుకోవాలి

**ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్**

**జిల్లాలోని ముస్లిం సోదర, సోదరీమణులకు**

**బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 6)**

జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా, దేవునిపై విశ్వాసాన్ని కలిగి సన్మార్గంలో జీవనం సాగించాలనే గొప్ప సందేశాన్ని మానవాళికి చూపుతూ, తమకు కలిగిన దాంట్లో నుంచి ఇతరులకు పంచిపెట్టే దాతృత స్ఫూర్తిని కలిగిస్తూ త్యాగానికి, సత్యానికి ప్రతీకగా నిల్చే బక్రీద్ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ సూచించారు. బక్రీద్ పండుగ వేడుకలు, కార్యక్రమాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడమైనదని, ముందస్తు భద్రత చర్యల్లో అన్ని మత పెద్దలతో, శాంతి కమిటీ సభ్యులతో పోలీసు అధికారులు సమావేశం నిర్వహించి ప్రార్ధనలు, ఇతర కార్యక్రమాలు సమయమంలో ఎలాంటి సంఘటనలు, సమస్యలు లేకుండా సుఖ, శాంతులతో జరుపుకోవాలని సూచిస్తూ విజ్ఞప్తి చేశారు. ముఖ్యమైన మసీదుల వద్ద డ్రోన్స్, సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని, ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోని మసీదులను కవర్ చేస్తూ పెట్రోలింగ్ నిర్వహించే విధంగా భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు, ఇతర వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వాహనాల పార్కింగ్ చేసుకోవాలన్నారు. మతసామరస్యానికి ఎటువంటి విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటిస్తూ, సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. జిల్లాలో గోవధ నిషేధ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేస్తున్నట్లు, గోవుల అక్రమ తరలింపును అడ్డుకునేందుకు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా గోవులను తరలించినా, గోవధకు పాల్పడినా వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. జంతువుల అక్రమ రవాణా, గోవధ నిరోధించడానికి ప్రకాశం జిల్లా నోడల్ అధికారిగా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె నాగేశ్వరరావుని నియమించడం జరిగింది. ప్రభుత్వం గోవధను నిషేధించిందని, గో సంరక్షణ చట్టం ప్రకారం గోవులను వధించడం చట్టరీత్య నేరమన్నారు. శాంతి భద్రతల సమస్యలు, మత సంఘర్షణలు తలెత్తేలా ఎవ్వరు ప్రవర్తించకూడదు, ప్రేరేపించరాదన్నారు. సోషల్ మీడియాలో మత విద్వేషాలు, సంఘర్షణలు రేకెత్తించే పోస్టులు పెట్టరాదు, షేర్ చేయరాదు. మత ఘర్షణలను ప్రేరేపించే పుకార్లను నమ్మవద్దు, అపోహలు, వదంతులను నమ్మి చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయరాదు.

**అందరు మతసామరస్య భావనతో శాంతియుతంగా మెలగాలి.**

గోవధ, పశువుల అక్రమ రవాణా పై ఏదైనా సమాచారాన్ని పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబర్ 9121102266, డయల్ 112, 100 స్థానిక పోలీసులకు తెలియచేయాలన్నారు. వ్యక్తిగతంగా వాహనాలను ఆపి గొడవలకు దిగరాదని,ఆ సమాచారం పోలీస్ లకు తెలియచేయాలని, కమిటీ సభ్యులు చర్యలు తీసుకుంటారని తెలియజేశారు. త్యాగానికి, సహనానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను శాంతి సామరస్యాలు వెల్లివిరిసేలా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ జిల్లాలోని ముస్లిం సోదర సోదరీమణులకు ఎస్పీ బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థిని మోక్షితకు అభినందనలు తెలిపిన మండల అధికారులు

**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్ఛార్జి, జూన్ 6)**



కొండపి మండల విద్యార్థినికి ఉత్తమ ప్రతిభ అవార్డు ఎంపిక 2024-25 సంవత్సరాలకు గాను ఎస్ఎస్సీ ఫలితాల్లో కొండపి మండలం కొండపి గ్రామానికి చెందిన కొండపి వెంకట మోక్షిత కృష్ణశ్రీకి మండలంలో మొదటి ర్యాంకు సాధించినందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా అవార్డు ప్రకటించింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు రాము,సునీత, కూతురు వెంకట మోషిత,కృష్ణశ్రీని అభినందించారు. వృత్తిరీత్యా తల్లి పంచాయతీ సెక్రటరీగా కొండపి మండలంలో విధులు నిర్వహిస్తూ ఉత్తమ పంచాయతీ సెక్రటరీగా రాష్ట్ర మంత్రి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. తండ్రి రాము మండల ఎమ్మార్వో ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్గా పనిచేస్తూ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 10వ తరగతి ఫలితాల్లో కొండపి మండలానికి మొదటి ర్యాంకు వచ్చినందుకు మండల తహసీల్దార్ మురళి, ఎంపీడీవో రామాంజనేయులు,మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓ సురేఖ, ఎంఈ ఓరామారావు విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

## బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ తూమాటి

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 6)**



త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదర, సోదరిమణులకు బాపట్ల పార్లమెంటు నియోజక వర్గ పరిశీలకులు, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవాజ్ఞను అనుసరించి సమాజ హితంకు ప్రతి మానవుడు నిస్వార్థ సేవలను అందించాలనే సందేశాన్ని బక్రీద్ మనకు అందిస్తుందని తెలిపారు. అలాగే, తమకు ఉన్న దాంట్లో నుండి ఎంతో కొంత ఇతరులకు పంచడమనే దాతృత్వ స్వభావాన్ని బక్రీద్ పండుగ ద్వారా నేర్చుకోవాలని అన్నారు. ఆ అల్లాహ్ ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఎమ్మెల్సీ తూమాటి మాధవ రావు ఆకాంక్షించారు.

## బక్రీద్ శుభాకాంక్షలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 6)**

ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం దురాచారాలను, బడుగు, బలహీన వర్గాల అణచివేతను వ్యతిరేకించి ధర్మ సంస్థాపన కోసం, పేదల ఉద్ధరణకు యుగపురుషుడు అబ్రజత్ ఇబ్రహీం జీవితాంతం చేసిన త్యాగాలకు ప్రతీకగా ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకుంటారు. పేదలకు దానధర్మాలు చేయాలనే గొప్ప ధ్యేయంతో ఏర్పాటు చేసిన పండుగ బక్రీద్ పండుగ. ముస్లింలకు ముఖ్యమైన పండుగలలో రెండవది బక్రీద్. పేదలకు దాన, ధర్మాలతో, భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను అందరు ఆనందంగా జరుపుకోవాలని కోరుతు ప్రకాశం జిల్లా ముస్లిం సోదరులకు, ప్రజలకు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు

## జిల్లా ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జూన్ 6)**

బక్రీద్ పర్వదినం సందర్భంగా జిల్లా ఇంఛార్జి మంత్రి, సమాచార పౌర సంబంధాల శాఖ, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో జిల్లా ప్రజలందరికీ, ముఖ్యంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం నిర్వహించే బక్రీద్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

## సీడీపీవో సరోజినీ ఆధ్వర్యంలో కనిగిరిలో సంసిద్ధ ఉత్సవాలు

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 6)**

కనిగిరి ప్రాజెక్టు పరిధిలోని కనిగిరి సెక్టార్లో సంసిద్ధ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో సరోజినీ ప్రధాన అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు సుమతి, పద్మజ, గ్రో, అసెస్మెంట్ ప్రతినిధి వెంకటలక్ష్మి కార్యక్రమాన్ని సమన్వయపరచగా అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో పిల్లల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో సీడీపీవో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పిల్లల భౌతిక, మానసిక, బౌద్ధిక, భాషా, సామాజిక అభివృద్ధిని పరిశీలించారు. అనంతరం రిపోర్ట్ కార్డులు తల్లుల సమక్షంలో పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీవో సరోజినీ మాట్లాడుతూ ఇలాంటి సంసిద్ధత ఉత్సవాలు నిర్వహించడం వల్ల పిల్లల అభివృద్ధిని సమగ్రంగా అంచనా వేయగలమని, తల్లుల్లో కూడా పిల్లల ఎదుగుదలపై అవగాహన పెరిగేలా చేయడం దీని ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ విధంగా నిర్వహించిన ఉత్సవాలు తల్లులకు విద్యా విధానాలపై అవగాహన కల్పించి, పిల్లల ఎదుగుదలపై మరింత చొరవ చూపేలా చేశాయన్నారు.






## ప్రతిభా పురస్కారానికి ఎంపికైన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ విద్యార్థిని

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 6)**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ 2025 ప్రతిభా పురస్కారాలకు స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవ వోకేషనల్ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థిని గన్నేబోయిన ఊర్మిళ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ విభాగం నందు ఎన్నికైనట్లుగా కళాశాల ప్రిన్సిపాల్ డి విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఊర్మిలాను ఆదర్శంగా తీసుకొని లక్ష్యంతో విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు చదువు నేర్పిన గురువులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. మట్టిలో మాణిక్యం అన్నట్లు పేద కుటుంబంలో జన్మించి కష్టపడి చదివి ఇంటర్మీడియట్ ఫలితాలలో 1000 మార్కులకు గాను 955 మార్కులను సాధించి నేడు ప్రతిభా పురస్కారానికి ఎంపికవడం గర్వించదగ్గ విషయం అన్నారు. అనంతరం ఊర్మిలాను వైస్ ప్రిన్సిపాల్ డి విజయ్ కుమారి అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## అనుమానాస్పద స్థితిలో చల్లా మధుసూదనరెడ్డి మృతి



**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్ఛార్జి, జూన్ 6)**

మండలంలోని నెన్నురుపాడు గ్రామానికి చెందిన చల్లా మధుసూదనరెడ్డి (43) ఈ నెల నాలుగో తేదీన వెన్నుపోటు కార్యక్రమాలు పాల్గొనటానికి వచ్చాడు. ఆ రోజు నుంచి ఇంటికి వెళ్లలేదు. కొండేపి నుండి టంగుటూరు వెళ్లే రోడ్డు టీవీఎస్ షోరూం ఎదురుగా వెంచర్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. సంఘటన స్థలంలో మోటర్ సైకిల్ కూడా ఉంది. పురుగులు పట్టి పోయిన మృతదేహంగా దర్శనం ఇచ్చింది. సంఘటన స్థలానికి కొండపి ఎస్ఐ ప్రేమ్ కుమార్ చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.



## అన్ని ప్రాంతాలకు మౌలిక వసతులు

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 6)

ఒంగోలు నగరం వేగంగా మారుతుందని, అన్ని ప్రాంతాలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని, దానికి అనుగుణంగా నిర్మాణ రంగం కూడా వేగం పుంజుకుంటుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు అన్నారు. కొద్ది కాలంలోనే ఒంగోలు నగర ప్రజలుకు ప్రతిరోజు తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. ఒంగోలు పట్టణంలోని దాదాపు అన్ని ప్రధాన రహదారులు వెడల్పు చేసి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు కొంత ఇబ్బంది పడిన అభివృద్ధి ఆగదు అన్నారు. ప్రగతి కాలనీవాసులు 2014 సమయంలో ఆరు అడుగుల లోతు ప్రాంతంలో నివసించే వారన్నారు. గత ఐదేళ్ల కాలంలో కాలనీలో ఎటువంటి అభివృద్ధి నోచుకోలేదన్నారు. కేవలం 6 నెలల వ్యవధిలోని ఒంగోలు రూపురేఖలు మార్చేందుకు శాయ శక్తుల పని చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎక్కడ పడితే అక్కడ చిరు వ్యాపారాలు ఉండకుండా, మటన్, చికెన్ దుకాణాలు రోడ్లపై కనిపించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చిరు వ్యాపారాల కోసం ఫుడ్ కోర్ట్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలు ఆహారం కావలసింది వారు అక్కడికే వచ్చి తింటారని పేర్కొన్నారు. అలాగే మటన్, చికెన్ షాపులు కూడా ఒకే ప్రాంతంలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రణాళిక బద్ధంగా ఒంగోలును అభివృద్ధి చేస్తున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 6)

త్యాగభావనకు, సహనానికి, మానవత్వానికి ప్రతీకగా పరిగణించబడే బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముస్లిం సోదరులకు, సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "బక్రీద్ పండుగ మనలోని దాతృత్వాన్ని, సమానత్వాన్ని ప్రదర్శించే గొప్ప అవకాశంగా ఉండాలి. ఇతరుల కోసం త్యాగం చేయడం, సహానుభూతి చూపించడం ఈ పండుగ ప్రధాన సందేశాలు. మన సమాజంలో స్నేహభావం, ఐక్యత మరింత పెరగాలంటే ఇటువంటి పండుగలు వేదికలవుతాయి అని తెలిపారు. అల్లాహ్ దయతో దేశంలో శాంతి, సామరస్యం నెలకొనాలని, ప్రతి కుటుంబం ఆనందంగా, ఆరోగ్యంగా, సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు. ఇటువంటి పండుగలు మత సౌభ్రాతృత్వానికి, జాతీయ ఏకత్వానికి చిహ్నాలుగా నిలవాలని పేర్కొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న గులకను లారీ, జేసీబీ సీజ్






(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 6)

ఉలవపాడు గ్రామంలోని వేచి ఉన్న శ్రీ నీలకంఠేశ్వర స్వామి దేవస్థానం ఆధీనంలో శానంపూడి గ్రామంలో ఉన్న సదరు దేవస్థానానికి చెందిన పొలాల్లో మైనింగ్ చేసి సదరు స్థలంలోని గులకను మనేటికోట జంక్షన్ వద్ద లారీ అసోసియేషన్ రూం వెనుక డంప్ చేసి సదరు డంపు చేసిన గ్రావెల్ ను తరలించడానికి శుక్రవారం ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో లారీలో జెసిబితో లోడు చేస్తూ ఉండగా ఉలవపాడు పోలీస్ సిబ్బంది, దేవస్థానం సిబ్బంది చేరుకుని అక్రమంగా తరలిస్తున్న గులకను, లారీలు జేసీబీను సీజ్ చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి ఓనర్ వల్లభనేని పని కుమార్‌పై కూడా ఉలవపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

# తెనాలి దళిత యువకుల పోలీస్ దాష్టికం పై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

### హోం మంత్రి అనితకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి
### దళిత నేత నీలం నాగేంద్రరావు డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 6)

తెనాలి దళిత యువకులను నడిరోడ్డుపై మంత్రి నాదెండ్ల మనోహర్ కుట్రతో కాకి కోటింగ్ ఇప్పించి దళిత సమాజాన్ని భయప్రాంతులు చేసిన మానవ హక్కుల ఉల్లంఘన ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నామని దళిత హక్కుల పరిరక్షణ సమితి నీలం నాగేందర్రావు తెలిపారు. అలాగే పోలీసులు కొడితే తప్పేమిటి అని నేరాలకి కులం, మతం చూడమంటున్నా దళిత హోంమంత్రి, రాజ్యాంగం నిపుణరాలు, క్రిమినల్ చట్టాల అమలులో ఆరితేరిన హోంమంత్రి వంగలపూడి అనితకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని దళిత సంఘాల నాయకులు ఈ సమావేశంలో తీర్మానించారు. శుక్రవారం స్థానిక సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ ఏప్రిల్ 22న తెనాలిలో దళిత యువకులను తెనాలి టూ టౌన్ 3 టౌన్ సిఐలు రాముల నాయక్ రమేష్ బాబులు అయితా నగర్ వద్ద బహిరంగంగా హైకోర్టు న్యాయవాది తో పాటు మరో ఇద్దరిని లాఠీలతో కొట్టి వాళ్ల కాళ్ళపై బూట్ కాళ్లతో తొక్కి కూటమి ప్రభుత్వ కాకి హింసను చూపించారన్నారు. ఈ ఘటనను వీడియో తీసి పోలీసులే దళితులను భయభ్రాంతులు చేయడానికి సోషల్ మీడియాలో విడుదల చేశారన్నారు. గంజాయి తాగుతున్నారు అనే వంకతో పోలీస్ మామూలు ఇవ్వలేదు అనే కక్షతో గతంలో తెనాలి అయితా నగర్ వద్ద అంబేద్కర్ విగ్రహం తొలగించే క్రమంలో దళితుల ప్రతిఘటనను జనసేన మంత్రి నాదెండ్ల మనోహర్ జీర్ణించుకోలేకపోయారు అన్నారు. మే 5న ముగ్గురు దళిత యువకులకి రౌడీ షీట్లు ఓపెన్ చేసి కానిస్టేబుల్ పై హత్యాయతనం చేశారని కాకమ్మ కాకి కథలు అల్లారన్నారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించకపోగా సోషల్ మీడియాలో వీడియో వైరల్ అవుతున్నప్పటికీ పోలీసులు కొడితే తప్పేంటని దళితులు న్యాయదేవత రాజ్యాంగా నిపుణరాలు హోం మంత్రి అనిత కాకి హింసకు వంత పాడారు. కూటమి ప్రభుత్వం సనాతన ధర్మం అమల లో భాగంగా తమ పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా తెనాలి దళిత యువకులపై పోలీస్ బహిరంగ హింసను టెస్ట్ మోడల్‌గా చూపించింది అన్నారు. కారం చేడు,చుండూరు ఉద్యమ బాధితులని హక్కున చేర్చుకున్న తెనాలి అయితా నగర్ దళితులు జైలు జీవితాలు గడిపి అక్రమ కేసులకు గురై చుట్టుపక్కల గ్రామ ప్రజానీకానికి అండగా ఉంటారన్నారు. అందుకే కక్ష కట్టి జనసేన మంత్రి నాదెండ్ల మనోహర్ అయితా నగర్ దళిత యువకులపై పోలీస్ దాడి చేయించారన్నారు. సమస్యను పరిష్కరించాల్సిన దళిత హోంమంత్రి అనిత రెచ్చగొట్టే వ్యాఖ్యలతో తెనాలి ఘటనకు మరింత మంటలు రేపింది అన్నారు. ప్రతిపక్షనేతగా విశాఖలో డాక్టర్ సుధాకర్ ని పోలీసులు కొట్టినప్పుడు వాళ్ళ ఇంటికి వెళ్లి పరామర్శించిన వంగలపూడి అనిత తెనాలి పోలీస్ బాధ్యత కుటుంబాలని పరామర్శించకపోగా దళితులదే తప్పన్నట్టు తాము చేసిందే చట్టం అన్నట్టు మాట్లాడారు. అంబేద్కర్ రాజ్యాంగం, చట్టాలు అమలు కావాల్సిన చోట తాలిబన్ తరహా పోలీస్ శిక్షలు సమంజసమే అంటూ మాట్లాడ్డం హోంమంత్రి విజ్ఞతకు, విజ్ఞానానికి నిదర్శనం. తెలుగుదేశం పార్టీ అభిమాని మాజీ ఇంటలిజెంట్ చీఫ్ ఏబి వెంకటేశ్వరరావు కూడా నడి రోడ్డుపై పోలీసులు కొట్టడం తప్పే అని మాట్లాడిన విషయాన్ని హోం మంత్రి తెలుసుకోవాలి అన్నారు. జగన్ ప్రభుత్వంలో ఐదుగురు ఉప ముఖ్యమంత్రి ఉండగా ప్రస్తుతం చంద్రబాబులో సనాతన స్టార్ పవన్ కళ్యాణ్ ఒక్కరే ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు అన్నారు కావున దళిత సామాజిక వర్గం నుండి హోం మంత్రి అనితను ఉప ముఖ్యమంత్రిగా వెంటనే నియమించాలని కూటమి ప్రభుత్వాన్ని దళిత నేత నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, పిల్లి మాలయాద్రి, కొప్పోలు ఏడుకొండలు, తదితరులు ఉన్నారు.

# నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి

### నారా లోకేష్ 20 లక్షల ఉద్యోగాల కల్పన నిరుద్యోగులకు వరం
### నవ్యాంధ్రప్రదేశ్ నిరుద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాతులూరి కుమార్




(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 6)

నవ్యాంధ్రప్రదేశ్ నిరుద్యోగ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ప్రతినిధుల విస్తృతస్థాయి సమావేశం విజయవాడలోని మొగల్రాజు పురం మండపంలో జరిగినది. ఈ కార్యక్రమానికి నవ్యాంధ్రప్రదేశ్ నిరుద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాతులూరి కుమార్ మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారిన నిరుద్యోగుల యొక్క సమస్యల తీరటం లేదని వాపోయారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన వనరుగా ఉండవలసిన చదువుకున్న యువత, ఈ రోజు ఉద్యోగాలు లేక కనీసం వారి యొక్క కుటుంబాలకు కూడా భారమవ్వటం సమాజంలో మనకు కనిపిస్తానే ఉంటాయి. గతంలో జాబ్ కారం పేరుతో జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులను దారుణంగా మోసం చేశారని అన్నారు. మా సంఘం యొక్క 19 రకాల డిమాండ్స్ లను త్వరలో ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు. గౌరవ సంఘ నేత ఎంవివి మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలకు ఇచ్చే నోటిఫికేషన్ కొరకు ప్రతి నియోజకవర్గంలో ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలి మరియు నిరుద్యోగులకు పింఛను సదుపాయం కూడా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉషారాణి మాట్లాడుతూ ఉద్యోగాలు లేకపోవడం వలన మహిళలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. మహిళా సాధికారత సాధించాలంటే నిరుద్యోగ శాతాన్ని తగ్గించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రాజు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్న ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ బేసిక్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి భవిష్యత్తులో ఔట్సోర్సింగ్ విధానాన్ని తీసి వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్రప్రదేశ్ నిరుద్యోగ సంఘం నాయకులు, పావని నాయుడు, సౌదామిని, రాజేశ్వరి, లత, మూడు జిల్లాల కోఆర్డినేటర్ రవికుమార్, ప్రభాకర్, వంశి, నరేంద్ర, తాడేపల్లి వంశి, తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పర్వదినానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి

### జిల్లా రెవెన్యూ అధికారి చిన్న ఓబులేసు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 6)

ఈ నెల 7వ తేదీన జరగనున్న పవిత్ర బక్రీద్ పర్వదినం సందర్భంగా అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు అధికారులతో సమావేశమై పవిత్ర బక్రీద్ పర్వదినం సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టవలసిన వసతులపై సమీక్షించి తగు సూచనలు, ఆదేశాలు జారిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గోవధ నిషేధ చట్టం 1977 కచ్చితంగా అమలు చేయడంతో పాటు బక్రీద్ పర్వదినం సందర్భంగా జంతువుల అక్రమ రవాణా, జంతు వధ నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని కబేళాలపై మరియు ఆవులు తదితర జంతు అక్రమ రవాణా మరియు జంతువధలపై కూడా ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు అవసరమైన సంఖ్యలో చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం మరియు అవసరమైన సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో జంతు అక్రమ రవాణా మరియు జంతువధ జరగకుండా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మతపెద్దలు కూడా తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు లక్ష్మి ప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి జి పార్ధసారధి, డిటిసి సుశీల, పోలీసు, మునిసిపల్ కమీషనర్లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# వినరో భాగ్యము విష్ణు కథబీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 6)

బ్రహ్మోత్సవాలతో ఒంగోలు నగరిలోని శ్రీగిరిలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తమ ఆరాధ్య దైవం శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో విచ్చేస్తున్న భక్తులతో శ్రీగిరి మరో దివ్య తిరుమల క్షేత్రంగా భాసిల్లుతూ ఆధ్యాత్మిక పరిమళాలను వెద జల్లుతున్నది. ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీవారికి అభిషేకంతో పాటు విశేష స్నపన తిరుమంజనం నేత్ర పర్వంగా నిర్వహించారు. ప్రముఖ వైఖానస ఆగమ పండితులు పరాంకుశం

**అన్నమయ్య సంకీర్తనల ఆలాపనతో భక్తులకు రసానందాన్ని పంచిన వినోద్ కుమార్**

**శోభాయమానంగా శ్రీవారి ఊంజల సేవ**

**శ్రీవారికి మేల్చాట్ వస్త్రాలను సమర్పించిన బొల్లాపల్లి సుబ్రహ్మణ్య హనుమత్ కిషోర్, ఫణి దీప్తి దంపతులు**







సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో యాగశాల పూజలు హోమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఒంగోలుకు చెందిన బొల్లాపల్లి సుబ్రహ్మణ్య హనుమత్ కిషోర్, వెంకట పణి దీప్తి దంపతులు శ్రీవారికి మేల్చాట్ వస్త్రాలను సమర్పించారు. వారికి వేద పండితులు అర్చకులు వేద ఆశీర్వచనం అంద చేసారు.

సాయంత్రం శ్రీవారి ఊంజల సేవ శోభాయమానంగా జరిగింది. ప్రముఖ గాయకులు శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వి వి ఎస్ వినోద్ కుమార్ పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య విరచిత "వినరో భాగ్యము విష్ణు కథ" వంటి పలు సంకీర్తనలను మృదు మధురంగా ఆలపించి భక్తులకు ఆధ్యాత్మిక రసానందాన్ని పంచిపెట్టారు. శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్, ఆలూరు జై శంకర్ తదితరులు గాయకులు వి వి ఎస్ వినోద్ కుమార్ ను ఘనంగా సత్కరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

**7 వ తేదీన జరుగు కార్యక్రమాల వివరాలు:**

శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా 7వ తేదీ శనివారం ఉదయం శ్రీవారికి విశేష స్నపన తిరుమంజనం, చక్ర స్నానం జరుగుతాయి. సాయంత్రం 6.30 లకు శ్రీవారికి శేష వాహన సేవ నిర్వహిస్తారు, రింద శరణ్య కూచిపూడి డాన్స్ అకాడమీ హైదరాబాద్ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన జరుగుతుంది. భక్తులు ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

**ప్రకాశం జిల్లా ముస్లిం ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 6)

త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తోందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు అన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం స్ఫూర్తితో ప్రజలు సత్యం, న్యాయం, ధర్మం, త్యాగం, సహనం, పరోపకారం, బాధ్యతాభావం అలవరచుకోవాలని ప్రజలందరూ ఆరోగ్యాలు, సుఖ శాంతులుతో జీవించాలని ప్రజలందరికీ అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ నియోజకవర్గ ముస్లిం సోదరులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయం పై మూడు రోజుల శిక్షణ

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జూన్ 6)





ప్రకృతి వ్యవసాయాన్ని బాపట్ల జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలలో విస్తరింపజేయాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో ఈటీసీ బాపట్లలో ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఏడీఏలకు, మండల వ్యవసాయ అధికారులకు, ఉద్యానవన శాఖాధికారులకు, ఏపీసీఎన్ఎఫ్ క్యాడర్‌కు జిల్లా స్థాయిలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించుటకు వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది సమన్వయం తో పని చేయాలని, చిన్నసన్న కారు, కౌలు రైతులు అందరికీ ప్రకృతి వ్యవసాయ విధానాలపైన, ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి రైతు పీఎండీఎస్ సాసాగు చేసి భూమిలో కలియ దున్నుట ద్వారా భూమిలో సేంద్రీయ కర్బనం పెంచుకోవచ్చున్నారు. దీని ద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.వాణిశ్రీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేందుకు కృషి చేస్తున్నామని, అందులో భాగంగానే వీఏఏలకు, వీహెచ్ఏలకు, వీఎస్ఏలకు ప్రకృతి వ్యవసాయం పై శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, అందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో రిసోర్స్ పర్సన్స్ కు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఉద్యానవన శాఖాధికారి జెన్నిమ్మ మాట్లాడుచూ ఉద్యానవన పంటల సాగు లో ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించడం ద్వారా మంచి ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపారు. ఇంటి వద్ద ఉన్న ఖాళీ స్థలంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పెరటి తోటలు పెంచుకొని పురుగు మందుల అవశేషాలు లేని కూరగాయలను, పండ్లను తినడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ 3 రోజుల శిక్షణలో పీఎండీఎస్ ప్రాముఖ్యత, వివిధ పంటలలో ఏ-గ్రేడ్ విధానం, ఏటీఎం మోడల్స్ గురించి వివరించారు. అమృతాలు, కషాయాలు తయారీ విధానాన్ని తెలిపిరి .రాబోయే రోజుల్లో డివిజన్ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి రైతు సేవా కేంద్రం నిర్వాహకులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం రాష్ట్రస్థాయి అధికారులు రామచంద్రం, భాగ్యలక్ష్మి, అడిషనల్ డిపిఎం మోహన్, ఏడీఏలు, ఏవోలు, హెచ్‌వోలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# శాంతియుతంగా బక్రీద్ పండుగ జరుపుకోండి

**ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు ఎస్ఐ నరసింహారావు**




(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 6)

కంభం మండల పరిసర ప్రాంత ముస్లిం సోదరులు అందరూ బక్రీద్ పండుగ శాంతియుతంగా జరుపుకోవాలని,అంకిత భావంతో పండుగ జరుపుకోవాలని ఎక్కడ కూడా ఎలాంటి గొడవలు ఘర్షణలకు తావులేకుండా, అల్లాహ్ సూచించిన విధంగా శాంతి సహనం వహిస్తూ పండుగ జరుపుకోవాలని శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ పండుగ జరుపుకోవాలని ఎస్ఐ నరసింహారావు ముస్లింలను కోరారు.

# ముస్లిం సోదర, సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు

**139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు**



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 6)

రాష్ట్ర ముస్లిం సోదర ,సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇస్లాం ధర్మ శాస్త్రం ప్రకారం దురాచారాలను వ్యతిరేకించి ధర్మస్థాపన కోసం, ఎంతో కృషి చేసిన అజిత్ ఇబ్రహీం జీవితాంతం త్యాగాలకు ప్రత్యేకగా బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకోవడం జరుగుతుందని ,పేదల కోసం దానధర్మాలు చేయాలని, ఎంతో భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకుంటారు. ముస్లిం సోదర, సోదరీమణులు సుఖ, సంతోషాలతో దేవుని దీవెనలతో ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలని బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

# మసీద్ పెద్దలతో పీస్ మీటింగ్ నిర్వహించిన సీఐ



(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 6)

కంభంలోని మసీద్ పెద్దలతో సీఐ మల్లికార్జున శుక్రవారం పీస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మల్లికార్జున మాట్లాడుతూ ఈద్గాలలో నమాజ్ సమయం, ప్రస్తుత పరిస్థితుల గురించి అడిగి తెలుసుకొని బక్రీద్ పండుగ అందరూ సుఖ,సంతోషాలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని ప్రభుత్వ ఉత్తర్వులు అందరూ పాటిస్తూ సహనంతో మంచిగా వ్యవహరిస్తూ పండుగ జరుపుకోవాలన్నారు. ప్రతి మస్జీద్ దగ్గర, ఈద్గాల దగ్గర బందోబస్తు ఏర్పాటు చేస్తామని, అందరూ ప్రభుత్వానికి పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మస్జీద్ పెద్దలు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు

**విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జూన్ 6)

సమాజ హితం కోసం అల్లాహ్ ఆజ్ఞ మేరకు మహ్మద్ ప్రకవక్త తన ప్రియ కుమారుల్లో ఒకరిని త్యాగం చేయడానికి సిద్ధపడగా.. ఆ త్యాగాన్ని స్మరిస్తూ జరుపుకునే పండుగే ఈద్- అల్- అదా అని మంత్రి అన్నారు. జీవితంలో ఎదురయ్యే ఎలాంటి సమస్యలకు వెరవకుండా దేవునిపై విశ్వాసాన్ని కలిగి, సన్మార్గంలో జీవనాన్ని సాగించాలనే గొప్ప సందేశాన్ని బక్రీద్ పండుగ చాటుతుంది. తమకు ఉన్న దాంట్లో నుంచే ఇతరులకు కొంత పంచిపెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదు అనే స్ఫూర్తి సూత్రంతో సంతోషకరంగా ముస్లిం సోదరులంతా కుటుంబ సమేతంగా పండుగ జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## రాష్ట్ర ప్రజలకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు

### రాష్ట్ర మాజీమంత్రి శిద్దా రాఘవరావు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 6)**

బక్రీద్ పండగ త్యాగానికి, భక్తి విశ్వాసానికి ప్రతీక అని రాష్ట్ర మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు అన్నారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ ఆధ్యాత్మిక భక్తి భావన పేద వారికి సాయం అందించే దానగుణంతో ప్రతి ఒక్కరూ ఆయన మార్గాన్ని అనుసరిస్తూ భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. అల్లా ఆశీస్సులు మీకు, మీ కుటుంబ సభ్యులకు అందాలని కోరుకుంటున్నట్లు శిద్ధా రాఘవరావు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

## అరుణ్ దీప్ ఆధ్వర్యంలో సచివాలయాలకు అంబేద్కర్ చిత్రపటాలు బహూకరణ



**(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 6)**

కంభం మండలం కందులాపురం పంచాయతీ కార్యాలయంలో నవ భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్ర పటాలను స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీర భద్రాచారి చేతుల మీదుగా కందులాపురం గ్రామంలోని మూడు సచివాలయాలకి దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ దీప్ బహూకరించారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఫోటోలను ఉచితంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సంఘం వాళ్ళు బహూకరించడం అభినందనీయం అని ఎంపీడీవో అన్నారు. ఈ కార్యక్రమంలో కంభం మండల విస్తరణాధికారిణి బి.విజయ లక్ష్మి, కార్యదర్శులు ఎ.జోస్యులు, పి సునీత, బిల్ కలెక్టర్ బేగ్‌లతో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ సాయి విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డులు





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 6)**

జూన్ 6 శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను 10వ తరగతి ఉత్తమ ఫలితాల విద్యార్థులకు ప్రకటించిన షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డులను ఉలవపాడు శ్రీ సాయి హై స్కూల్ 10వ తరగతి ఇద్దరు విద్యార్థులు సాధించారు. ఉలవపాడు గ్రామానికి చెందిన మరపు శివ సాహిత్, కరేడు గ్రామానికి చెందిన నందాల ప్రేమ కుమార్ ప్రతిభ అవార్డులకు ఎంపిక అయ్యారు. సోమవారం నెల్లూరు కస్తూరిబా కళాక్షేత్రం నందు జరుగు షైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డుల కార్యక్రమంలో అవార్డు పొందిన విద్యార్థులకు రూ.20,000ల నగదు బహుమతితో పాటు మెడల్, అప్రిసియేషన్ సర్టిఫికేట్ అందుకోబోతున్నారు. ఈ సందర్భంగా అవార్డు పొందిన శ్రీ సాయి విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ కేశవరపు వెంకట శేషమ్మ, ప్రిన్సిపల్ మోనిక, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

# వరుస ఓపెనింగ్‌తో బిజీ బిజీగా దామచర్ల

# దుండి కన్స్ట్రక్షన్స్ కార్యాలయం ప్రారంభం

### శ్రీ మంజునాథ ఆక్వా ఏజెన్సీ ప్రారంభం

### ఒంగోలు స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ ప్రారంభం









**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 6)**

వరుస ప్రారంభోత్సవాలతో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు శుక్రవారం బిజీబిజీగా గడిపారు. ఒంగోలులోని సంఘమిత్ర హాస్పిటల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన దుండి కన్స్ట్రక్షన్స్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే దామచర్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన జగదీష్, బాలకృష్ణలు హైదరాబాదు నగరంలో విశేషమైన కన్స్ట్రక్షన్ అనుభవం కలిగి సొంత జిల్లాలో ప్రజలకు సేవ చేసేందుకు కార్యాలయాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. నిర్మాణరంగంలో దుండి కన్స్ట్రక్షన్స్ వారు మరింత అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**శ్రీ మంజునాథ ఆక్వా ఏజెన్సీ ప్రారంభం**

ఒంగోలులోని 47వ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మంజునాథ ఆక్వా ఏజెన్సీ దుకాణాన్ని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ బ్రో వెల్ ఫీడ్ ఏజెన్సీ ని తీసుకొని మనం కృష్ణారావు, కాకర్ల కృష్ణ చైతన్య శ్రీ మంజునాథ ఆక్వా ఏజెన్సీ ప్రారంభించడం శుభ పరిణామం అన్నారు. తాము కూడా ఆక్వా రంగంలో ఉన్నట్లు పేర్కొన్నారు. తమకి ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని, చెరువులు ఉన్నాయని గుర్తు చేశారు. మారుతున్న పరిస్థితులు కనుగుణంగా నూతన టెక్నాలజీతో మంచి గ్రోత్ తో, మంచి ఫీడ్ అందించడంలో బ్రోవెల్ ఫీడ్ ముందు వరుసలో ఉందన్నారు. బ్రో వెల్ ఫీడ్ అధినేత నరేంద్ర చౌదరి రాష్ట్రంలోని అన్ని తీర ప్రాంతాలలో ఏజెన్సీలు ఏర్పాటు చేశారన్నారు. ఆక్వా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుంది అన్నారు. విద్యుత్తు సబ్సిడీ, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. శ్రీ మంజునాథ ఆక్వా ఏజెన్సీ బాగా జరగాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ఒంగోలు స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ ప్రారంభం**

ఒంగోలులోని లంబాడి డొంకలో నూతనంగా ఏర్పాటు చేసిన ఒంగోలు స్పీచ్ అండ్ హియరింగ్ క్లీనిక్‌ను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ కేవలం వినికిడికి సంబంధించి ప్రత్యేక క్లినిక్ ఒంగోలుకు రావడం శుభ పరిణామం అన్నారు.

**పదేళ్ల అనుభవం కలిగిన వైద్య నిపుణులు**

పెద్దినేని అనిల్ కుమార్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. డాక్టర్ పెద్దినేని అనిల్ కుమార్ మాట్లాడుతూ ఉన్న వినికిడి శాతాన్ని సాధ్యమైనంత ఎక్కువకాలం కాపాడుకునేందుకు, చిన్న శబ్దాలు మొదలుకొని దూరం నుంచి మాట్లాడిన మాటలు సైతం స్పష్టంగా వినటానికి, పోగ్రామ బుల్ హీరింగ్ ఎయిట్ వాడుట వలన మెరుగైన శబ్ద గ్రహణ పొందవచ్చు అన్నారు. తమ క్లినిక్ లో కంప్యూటర్ సైజులు వినికిడి పరీక్షలు, అత్యధిక టెక్నాలజీ గల బ్లూటూత్ , రీఛార్జిబుల్ మిషన్లు లభిస్తాయని, కంటికి కనిపించని వినికిడి మిషన్లు లభిస్తాయని, అన్ని రకాల బ్యాటరీలు లభిస్తాయని, చేయటం జరుగుతుందని, బుద్ధిమాంద్యత, నత్తి, పక్షవాతం, మాటలలో స్పష్టత లేకుండా, స్వర సంబంధమైన సమస్యలను స్పీచ్ థెరపీ ద్వారా చికిత్స చేయటం జరుగుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో నగర మేయర్ గంగాధర్ సుజాత, టిడిపి నాయకులు బందారు మదన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధికారులు ప్రజల సమస్యలు పరిష్కరించాలి

### ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 6)**

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు ఆదేశించారు. ఒంగోలులోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి నీటి కొళాయి ఉండాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను ఉపయోగించుకొని నీరు అందేలా చూడాలన్నారు. మండలం లోని అన్ని గ్రామాల్లో 90 శాతం మేర సీసీ రోడ్లు వేయడం జరిగిందని, పూర్తి స్థాయిలో సైడ్ డ్రెయిన్లు నిర్మించేలా త్వరలో టెండర్లు పిలవనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడా భూ సమస్యలు తలెత్తకుండా ఉండేలా గ్రామాల వారీగా రెవెన్యూ బృందాలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గ్రామాల వారీగా జగనన్న కాలనీలపై నివేదిక అందించాలని తాహసిల్దారును ఆదేశించారు. వారానికి ఒకసారి ప్రతి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలను పరీక్షించి మందులు అందించాలని వైద్యాధికారికి సూచించారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. త్వరలో తాను అన్ని గ్రామాలను తనిఖీ చేస్తానని, ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని దామచర్ల హెచ్చరించారు. మండల పరిషత్ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపిడీవో రాజశేఖర్, తహసీల్దార్ నాయబ్ రసూల్, ఈఓఆర్‌డి బాలచెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.






On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com